భక్తిశ్రద్ధలతో బక్రీద్

బోథ్: మండల వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. బోథ్, సోనాల, మర్లపెల్లి, కౌఠ, కనుగుట్ట గ్రామాల్లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జైనథ్: మండల కేంద్రంలో బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్దకు చేరుకొని, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం మత పెద్దలు బక్రీద్ నేపథ్యం, పవిత్రతను వివరించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని, ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంతో పాటు బీర్సాయిపేట, దంతన్‌పల్లి, హస్నాపూర్, శ్యాంపూర్ గ్రామాల్లో ముస్లింలు మసీద్, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థలు చేశారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కాంగ్రెస్ నాయకులు సుగుణ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇచ్చోడ: మండలంలో సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఉదయమే ఈద్గా వద్దకు చేరుకున్నారు. మతపెద్దలు సందేశం వినిపించారు.


సిరికొండ: ప్రార్థన చేస్తున్న ముస్లింలు

సిరికొండ: మండల కేంద్రంలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకతున్నారు. ముస్లిం సోదరులు ఉదయమే దర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ముత్నూర్, శంకర్‌గూడ, దనోరా(బి) గ్రామాల్లో సోమవారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మసీద్, ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ ఇళ్లల్లో విందు భోజనాలు ఏర్పాటు చేసి అతిథితులను ఆహ్వానించారు.


ఇంద్రవెల్లి: కేస్లాగూడలో..


ఇచ్చోడ: ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థన


ఉట్నూర్‌రూరల్: పాల్గొన్న ముస్లింలు


జైనథ్‌లో..

త్యాగానికి ప్రతీక బక్రీద్


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లు అన్నారు. సోమవారం బక్రీద్ పండగను పురస్కరించుకొని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, సాబ్లే ప్రతాప్ సింగ్, బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.


బోథ్: శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

క్లుప్తంగా

'ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి'

కైలాస్‌నగర్: ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో పనిచేసే ఉద్యోగి నాందేవ్ ఆత్మహత్యకు అక్కడి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని ఏఐఎస్ఎస్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ ఆరోపించారు. అందుకు బాధ్యుడైన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ప్రకటనలో డిమాండ్ చేశారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించడంతో పాటు న్యాయ నిపుణులతో కమిటీ వేసి విచారణ చేపట్టాలని కోరారు.

మాజీ మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యే


శంకర్ యాదవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం పరామర్శించారు. మాజీ మంత్రి సోదరుడు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో హైదరాబాదులోని మాజీ మంత్రి నివాసంలో పరామర్శించారు. శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వృక్షం చుట్టూ గద్దె నిర్మాణం

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన ఏలేటి ప్రభాకర్‌రెడ్డి గ్రామంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద గల రావిచెట్టు చుట్టూ గద్దె నిర్మించారు. ఆలయానికి వచ్చే భక్తులు పూజలు చేసేందుకు సౌకర్యార్థం గద్దెను నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ప్రభాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వర్షం కోసం ఎదురుచూపు


స్ప్రింక్లర్లతో నీటిని అందిస్తున్న రైతు

ఆదిలాబాద్‌రూరల్: వానాకాలం సీజన్‌లో రైతులు జూన్ నెలలోనే విత్తనాలు వేసుకుంటారు. మండలంలో సుమారు 35 వేల ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలో ప్రధానంగా పత్తి, సోయాబీన్ సాగు చేస్తారు. జూన్ నెల గడుస్తున్నా.. వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు విత్తనాలు వేసుకొని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు స్ప్రింక్లర్‌లతో నీటి తడులు అందిస్తున్నారు.

సూచిక బోర్డు ఇలా.. గమ్యం తెలిసేదెలా?


కింద పడిపోయిన సూచిక బోర్డు

కైలాస్‌నగర్: మావల మండల కేంద్రంలోని బైపాస్ వద్ద గల జాతీయ రహదారిపై ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి, విమానశ్రాయ మైదానం దూరం తెలిపేలా ఏర్పాటు చేసిన సూచికబోర్డు విరిగి పోయింది. జాతీయ రహదారి కావడంతో ప్రతినిత్యం వందలాది వాహనాలు రావడంతో పాటు పట్టణానికి వచ్చే వారు కూడా వందల సంఖ్యలో ఉంటారు. విరిగిపడి నెలలు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

వర్షాల కోసం పూజలు


హనుమాన్ విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: వరుణుడు కరుణించి వర్షాలు కురువాలని కోరుతూ సవర్గాం గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. వీధుల గుండా నృత్యాలతో చేస్తూ హనుమాన్ ఆలయంకు చేరుకున్నారు. ఆంజనేయునికి జలాభిషేకం చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురువాలని వేడుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: మావల సెక్షన్ పరిధిలోని దస్నాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దస్నాపూర్, ధోబి కాలనీ, పిట్టలవాడ, కోజాకాలనీ రాంనగర్, సుభాష్ నగర్, ఎంప్లాయిస్ కాలనీ, టైలర్స్ కాలనీ, పోలీస్ కాలనీ, గ్రీన్‌సిటీ, కేఆర్‌కే కాలనీ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు అభినందన సభ

ఇచ్చోడ: మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ విజయోత్సవ, అభినందన సభ నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 11 గంటలకు రాయల్ ఫంక్షన్ హాల్‌లో సభ ఉంటుందన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకుల కోసం రెడ్డి యువత ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ వారంతో 21వ వారానికి చేరుకుంది. రెడ్డి యువత అన్నదానం చేపట్టి రోగుల సహాయకులకు భోజనం వడ్డించారు.

హైదరాబాద్ నుంచి బోథ్‌కు బస్సు నడపండి

బోథ్: హైదరాబాద్ నుంచి నియోజకవర్గ కేంద్రం బోథ్, సోనాల వరకు రాత్రి వేళల్లో బస్సు నడపాలని బోథ్, సోనాల ప్రజలు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. హైదరాబాద్‌లో నిర్మల్ డిపో బస్సు రాత్రి 9 గంటలకు బోథ్, సోనాల పేరుతో బోర్డు ఉంటుందని, బస్సు మాత్రం నిర్మల్ వరకే వస్తుందన్నారు. సోనాల వరకు నడపాలని కోరుతున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ ప్రీమియర్ లీగ్– 5 క్రికెట్ పోటీలు సోమవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సైనిక్ సిక్సర్ విజేత జట్టుగా నిలవగా, రైజింగ్ రైడర్ జట్టు రన్నరప్‌గా, సర్జికల్ స్ట్రైకర్ తృతీయ స్థానంలో నిలిచాయి. ఆయా జట్లకు ట్రోఫీతో పాటు నగదు అందజేశారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, బద్దం పోతారెడ్డి, నిర్వాహకులు పవన్ కుమార్, దేవేందర్, దినేష్, లఖన్, యోగి పాల్గొన్నారు.


ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎంపీ నగేశ్‌ను కలిసిన నాయకులు

ఆదిలాబాద్: ఎంపీగా ఎన్నిక కావడం పట్ల ఎంపీ గోడం నగేశ్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదిమ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర నాయకుడు సిడాం వామన్ రావు, ఉయిక విటల్, భీం రావ్, దేవ్‌రావ్, బలిరాం పాల్గొన్నారు.

● ఆదిలాబాద్ ఎంపికగా గోడం నగేశ్ గెలుపొందిన సందర్భంగా ఆయా సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఎంపీని కలిసిన వారిలో పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోండ్ల నారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీరాం శర్మ, సహ కార్యదర్శి దత్తాత్రేయ, నగర ఉపాధ్యక్షుడు పట్టపు సతీష్, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీని సన్మానిస్తున్న గిరిజన నాయకులు

గిరిజన గ్రామాలకు అధ్వాన రోడ్లు


కునికాసా గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలు ఏర్పడి 50 ఏళ్లు అవుతున్నా.. పాలకులు కనీస సౌకర్యాలు కల్పించలేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నారు. చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారి బైక్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గాదిగూడ మండలంలోని పర్సువాడ, కునికాసా, కొలంగూడ, గోండుగూడ, గాదిగూడ పున్నగూడ గ్రామాలకు రోడ్డుకు లేక కాలినడకన నడుచుకుంటూ.. వెళ్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఎడ్ల బండి సాయంతో ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి. అధికారులకు, పాలకులకు స్పందించి గిరిజన గ్రామాకలు రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


పున్నగూడ రోడ్డు దుస్థితి

విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

ఖానాపూర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని చేపడుతుందని ఖానాపూర్ సబ్‌డివిజన్ విద్యుత్ శాఖ ఏడీఈ కొట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఈఆర్వో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి హాజరై ఆరు దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ సోమవారం విద్యుత్ కార్యాలయాల్లో ప్రజావాణి ఉంటుందని తెలిపారు.

నిత్యం కరెంట్ కోతలు

బోథ్: బోథ్ మండల కేంద్రంలో తరచూగా కరెంటు కోతలు విధిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎలాంటి ఈదురుగాలులు లేకున్నా.. కరెంట్ నిలిపి వేస్తుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి మరమ్మతుల కోసం గ్రామం మొత్తం కరెంట్ తీసివేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కరెంట్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అంకోలిలో మద్యపాన నిషేధం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి గ్రామంలో మద్యపాన నిషేధం చేస్తూ గ్రామంలోని మహిళలు, యువకులు సోమవారం తీర్మానం చేశారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఆధ్యాత్మిక మార్గంలో పయణించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే గ్రామస్తులందరూ కలిసి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

ఇంద్రవెల్లి: గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని మారుతిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతిగూడ గ్రామానికి చెందిన గోడం నాగోరావ్ (58) వాల్గొండ హీరాపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీలో 2009 నుంచి 2014 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. 2020 నుంచి హీరాపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్‌గా సేవలందించారు. సోమవారం తెల్లవారుజమున ఛాతినొప్పి రావడంతో కుటుంబసభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఎంపీ గోడం నగేశ్, ప్రజాప్రతినిధులు మారుతిగూడ గ్రామానికి చేరుకొని భౌతికాయానికి పూలమాల వేసి శ్రద్ధంజలి ఘటించారు.

తీన్మార్ మల్లన్నకు సన్మానం


సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నను పీఆర్టీయూ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. నల్గొండలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆ సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్ సింగ్, నవీన్ యాదవ్‌లు సంఘం రాష్ట వ్యవస్థాపక అధ్యక్షుడితో కలిసి పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

యువకుడికి సన్మానం

నేరడిగొండ: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 210వ ర్యాంకు సాధించిన గిరిజన యువకుడు బుక్య విజయ్‌రాజ్‌ను సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించారు. గిరిజన యువకుడు బుక్య విజయ్‌రాజ్ జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. గిరిజన యువకులు విద్య, ఉద్యోగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలేటి రవీందర్ రెడ్డి, పాండు రంగ్, రాథోడ్ సురేందర్, ధన్‌రాజ్, సాయిరాం, రమేశ్, రాజు నాయక్ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

నార్నూర్: గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులగూడ గ్రామంలో తాగునీటి ట్యాంకు వద్ద మురుగు నీరు పేరుకుపోయింది. దీంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నీటి ట్యాంకు నుంచి నీరు లీకేజీ కావడంతో బురదగా మారుతోంది. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారిగా ఉన్న ఎంపీడీవో ఇప్పటివరకు గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి ట్యాంకు వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


రాజలగూడ తాగునీటి ట్యాంక్ వద్ద బురద

ఎస్పీని కలిసిన ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సోమవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను మర్యాద పూర్వకంగా కలిశారు. బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ఆదిలాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి ఉన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆడే గజేందర్

ఎస్పీని కలిసిన హిందూ ఉత్సవ సమితి నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని సనాతన హిందూ ఉత్సవ సమితి నాయకులు జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పోలీస్ కారాలయంలో కలిసి స్వీట్ తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, హన్మాండ్లు యాదవ్, తోట పరమేశ్వర్ తదితరులు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

దర్జాగా పార్కింగ్



జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇటుగా వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదంతా ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు చూస్తున్నా.. కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్